ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



సంగారెడ్డి 5 మెదక్
జిల్లాల వార్తలు
శుక్రవారం 24 మే 2024

నేడు పాలి సెట్..
ఇంటర్ 'సప్లిమెంటరీ' ప్రారంభం
7
కళ్లలో కారం కొట్టి కిడ్నాప్
సంగారెడ్డి జిల్లా కల్హేర్‌లో ఘటన

జడ్పీ చైర్‌పర్సన్
అటా.. ఇటా..?

- బీఆర్ఎస్‌లో వర్గ విభేదాలు
- నియోజకవర్గాల్లో అడుగు పెట్టనివ్వని అప్పటి ఎమ్మెల్యేలు
- జిల్లాస్థాయి పదవి అయినా మండలానికే పరిమితం
- సొంత మండలంలోనూ గ్రూపులు
- ప్రత్యర్థులను ప్రోత్సహిస్తున్న నియోజకవర్గ నేత

మనోహరాబాద్, మే 23: మెదక్ జడ్పీ చైర్‌పర్సన్ హేమాలత శేఖర్‌గౌడ్ రాజకీయ భవిష్యత్తుపై జోరుగా చర్చ సాగుతున్నది. ఆమె బీఆర్ఎస్‌లో కొనసాగుతారా? పార్టీ మారుతారా? అనేదానిపై ఉత్కంఠ నెలకొన్నది. మనోహరాబాద్ మండల కేంద్రానికి చెందిన హేమలత భర్త ర్యాకాల శేఖర్‌గౌడ్ టీఆర్ఎస్ ఆవిర్భావం నుంచి పార్టీలో ఉన్నారు. ఉమ్మడి తూప్రాన్ మండలంలో తెలంగాణ ఉద్యమాన్ని, టీఆర్ఎస్ పార్టీని ముందుండి నడిపించారు. పార్టీ కోసం పనిచేయడం తప్ప ఎలాంటి పదవిని చేపట్టలేదు. ఐదేళ్ల క్రితం జరిగి స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో తన రాజకీయ గురువు ఎలక్షన్‌రెడ్డి తదితరులు హరీశ్‌రావు దృష్టికి తీసుకువెళ్లి శేఖర్‌గౌడ్‌కు జడ్పీటీసీ టికెట్ ఇవ్వాలని కోరారు. రిజర్వేషన్‌లో భాగంగా ఆయన సతీమణి హేమలత జడ్పీటీసీగా పోటీచేసి గెలుపొందారు. అనంతరం అప్పటి సీఎం కేసీఆర్, హరీశ్‌రావు అండతో మెదక్ జిల్లా జడ్పీ చైర్‌పర్సన్‌గా ఆమె ఎన్నికయ్యారు.



హేమాలత శేఖర్‌గౌడ్ దంపతులు (ఫైల్)

మండలానికే పరిమితం

జడ్పీ చైర్‌పర్సన్‌గా జిల్లాస్థాయి పదవి చేపట్టినా హేమలతశేఖర్‌గౌడ్ మండలానికే పరిమితమయ్యారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నా అప్పటి ఎమ్మెల్యేలు ఆమెను తమ నియోజకవర్గాల్లో అడుగు పెట్టనివ్వలేదు. జిల్లాస్థాయి వ్యవహారాల్లోనూ ఆమెకు ప్రాధాన్యం దక్కలేదు. దీంతో మెదక్ జడ్పీ కార్యాలయం, సొంత మండలంలోని కార్యక్రమాలకు మాత్రమే పరిమితమయ్యారు. ఈ నేపథ్యంలో గజ్వేల్‌లో కాంగ్రెస్ తరఫున కేసీఆర్‌పై పోటీచేసి ఓడిపోయిన వంటేరు ప్రతాప్‌రెడ్డి తదనంతర కాలంలో బీఆర్ఎస్‌లో చేరారు. నియోజకవర్గంలో పార్టీ కార్యక్రమాలను దగ్గరుండి చూసుకుంటున్నారు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల అనంతరం గజ్వేల్ నియోజకవర్గ పార్టీలో అన్నీతానై వ్యవహరిస్తున్నారు. మనోహరాబాద్ మండలంలో చైర్‌పర్సన్‌కు వ్యతిరేకవర్గానికి చెందిన నాయకులు వంటేరు అండతో మండలంలో పార్టీ కార్యక్రమాలను నిర్వహించారు. దీంతో చైర్‌పర్సన్‌కు సొంత మండలంలోనూ ప్రాధాన్యం తగ్గిపోయింది.

రెండు వర్గాలు కాంగ్రెస్‌లోకి..

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పలువురు బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లోకి వెళ్లారు. దీంతో ప్రతాప్‌రెడ్డి వర్గంలోని ఎంపీపీ పురం నవనీత, మరికొందరు నాయకులు, జడ్పీచైర్‌పర్సన్ వర్గంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పురం మహేష్ తదితరులు మాత్రమే మిగిలారు. వేర్వేరుగా కాంగ్రెస్‌లో చేరిన ఇరువర్గాల నాయకులు అక్కడ కూడా ఎవరికివారు వర్గాలను కొనసాగిస్తుండడం గమనార్హం.

సొంత పార్టీలో వర్గపోరు

జడ్పీ చైర్‌పర్సన్‌కు జిల్లాస్థాయి పదవి ఇచ్చినా పారిపాలన వ్యవహారంలో ప్రాధాన్యం లేకపోవడంతో వ్యతిరేక వర్గం ఏర్పడింది. వంటేరు ప్రతాప్‌రెడ్డి పెత్తనం చెలాయించడంతో మనోహరాబాద్ మండలంలో బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్‌లోకి వెళ్లిపోతున్నారని బీఆర్ఎస్ కార్యకర్తలు అంటున్నారు. ప్రతిపక్షంలో ఉన్నా రెండువర్గాలు పార్టీ కార్యక్రమాలు, ఆందోళనల్లో ఎవరికివారు పాల్గొంటున్నారు. ఇటీవల కొనుగోలు కేంద్రాల వద్ద చేపట్టిన ధర్నాలో వంటేరు ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు. జడ్పీ చైర్‌పర్సన్ హాజరవుతారని మొదట చెప్పినా ఆమె రాలేదు. విభేదాలు ఇలాగే కొనసాగితే మండలంలో బీఆర్ఎస్ ఖాళీ అయ్యే అవకాశం ఉందని కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జడ్పీ చైర్‌పర్సన్ కూడా బీఆర్ఎస్‌లో కొనసాగుతారా.. తన దారి తాను చూసుకుంటారా అని చర్చించుకుంటున్నారు.

- హడావుడిగా చేపట్టడంతో నాసిరకం
- కొన్నిచోట్ల అసంపూర్తి నిర్మాణాలు.. మరికొన్నిచోట్ల ప్రారంభించనే లేదు
- గడువులోగా పనుల పూర్తి గగనమే

సర్కారు బడులను బలోపేతం చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం 'అమ్మ ఆదర్శ కమిటీ'ల పేరుతో మౌలిక సౌకర్యాలు కల్పన, అభివృద్ధి పనులను చేపట్టింది. ఈ పనులను స్వయం సహాయక సంఘాలకు అప్పగించింది. గత నెలలోనే ప్రారంభం కాగా, ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. చాలా చోట్ల హడావిడిగా చేపడుతున్న పనులతో వాటి నాణ్యత ప్రశ్నార్థకంగా మారింది. ఫలితంగా పాఠశాలల అభివృద్ధి కోసం వెచ్చించిన ప్రజాధనం వృథా అవుతోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

- సంగారెడ్డి అర్బన్/ మెదక్ అర్బన్

అమ్మా.. ఇలాగైతే ఎలా?



సంగారెడ్డిలోని హనుమాన్‌నగర్ ప్రాథమిక పాఠశాలలో పూడిక దశలోనే నీటి సంపు, అసంపూర్తిగా మరుగుదొడ్ల పనులు

'ఆదర్శ పాఠశాల' పనుల్లో నాణ్యత ప్రశ్నార్థకం!

సర్కారు బడుల్లో తాగునీరు, చిన్న చిన్న మరమ్మతులు, టాయిలెట్‌ల రిపేర్‌లు, విద్యుదీకరణ పనులు, పాఠశాల భవనానికి ఆకర్షణీయమైన రంగులు వేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో తాగునీటి యూనిట్‌కు రూ.లక్ష, చిన్న చిన్న మరమ్మతులకు యూనిట్‌కు రూ.2 లక్షలు, టాయిలెట్‌ల మరమ్మతుకు యూనిట్‌కు రూ.35 వేలు, విద్యుదీకరణ యూనిట్‌కు రూ.25 వేలుగా నిర్ణయించారు. ఒక్కో పాఠశాలలో రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకు వివిధ రకాల అభివృద్ధి పనులను చేపట్టారు. పాఠశాలల్లో చేపట్టే వివిధ నిర్మాణ బాధ్యతలను పబ్లిక్ హెల్త్, పంచాయతీరాజ్, టీఎస్ఈడబ్ల్యూఐడీసీ, ఇరిగేషన్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్లకు అప్పగించారు. సంగారెడ్డి జిల్లాలో 756 బడుల్లో అమ్మ ఆదర్శ పాఠశాలల్లో కమిటీ ద్వారా పనులు జరుగుతున్నాయి. జిల్లాకు రూ.27 కోట్లు నిధులు కేటాయించినట్టు అధికారులు తెలిపారు. మెదక్ జిల్లాలో 562 పాఠశాలలను ఎంపిక చేశారు. రూ.20.62 కోట్ల నిధులను అవసరమవుతాయని అంచనా. మొదటి విడతలో ప్రారంభించిన పనులకు సంబంధించి 25 శాతం నిధులు రూ.5.15 కోట్లు విడుదల చేసింది. మెదక్ జిల్లాలో ఇప్పటివరకు 60 శాతం పనులు మాత్రమే పూర్తయినట్లు డీఈవో తెలిపారు.

నెలాఖరుకు పూర్తి చేయడం కష్టమే!

సర్కారు బడుల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా చేపట్టిన పనులు ఈ నెలాఖరు వరకు పూర్తి చేయాలనే లక్ష్యాన్ని నిర్దేశించారు. అటు ఇటుగా పాఠశాలల పునఃప్రారంభం(జూన్12)నాటికి పూర్తి చేయాలని జిల్లా యంత్రాంగం ఆయా ఇంజనీరింగ్ విభాగాలకు సూచించింది. జిల్లా వ్యాప్తంగా స్వయం సహాయక సంఘాలు పనులు చేపడుతుండగా, లేనిచోట్ల ఇతర కాంట్రాక్టర్ల ద్వారా పనులు చేయిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే జిల్లా వ్యాప్తంగా చాలా చోట్ల చేపట్టిన పనులు నత్తనడకన సాగుతున్నాయి. కొన్ని చోట్ల ఒకటి, రెండు రకాల పనులు చేసి మిగతా పనులు అసంపూర్తిగా వదిలేసినట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో వివిధ దశల్లో ఉన్న పనులు గడువులోగా పూర్తి కావడం సాధ్యమయ్యేలా లేదని తెలుస్తోంది.



సంగారెడ్డిలోని గొల్లగూడెం ఎంపీపీఎస్ పైకప్పుపై డాంబర్ షీట్లు వేసేందుకు ఉపయోగిస్తున్న గృహ గ్యాస్

కొరవడిన పర్యవేక్షణ


జిల్లావ్యాప్తంగా కొనసాగుతున్న అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ పనులను త్వరితగతిన పూర్తి చేయించాల్సిన బాధ్యత సంబంధిత శాఖ అధికారులపై ఉన్నా.. ఆ దిశగా చొరవ చూపడం లేదని తెలుస్తోంది. జిల్లా విద్యాశాఖతో పాటు ఆయా విభాగాల అధికారులు పెద్దగా దృష్టి సారించకపోవడమూ పనుల ఆలస్యానికి కారణం. అంతేకాకుండా పనులు జరిగే పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు అందుబాటులో ఉండాలని కలెక్టర్ క్రాంతి అప్పట్లో ఆదేశాలు జారీ చేసినా బేఖాతరు చేస్తున్నారు. కొంతమంది ప్రధానోపాధ్యాయులు అటువైపు తొంగి చూడడం లేదన్న ఆరోపణలున్నాయి. మొత్తంగా ఆయా శాఖల అధికారులు, ప్రధానోపాధ్యాయుల పట్టింపు లేక పనులు నెమ్మదించాయి.

నాణ్యత నగుబాటు

అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ పనుల్లో నాణ్యత కొరవడింది. హడావుడిగా పూర్తి చేయాలనే ఒత్తిడి తీసుకురావడంతో చేపట్టాల్సిన పనుల్లో నాణ్యత ప్రమాణాలు ఏ మాత్రం పాటించడం లేదు. ఇందుకు జిల్లా కేంద్రమైన సంగారెడ్డి మార్క్స్‌నగర్‌లోని ఎంపీపీఎస్ ఉర్దూ మీడియం పాఠశాలే నిదర్శనం. ఆ పాఠశాల ఆవరణలో నీటి నిల్వ కోసం సంపును నిర్మించగా, కొన్నిరోజులకే సంపు చుట్టూ సిమెంట్ బీటలు వారింది. అంతే కాకుండా పలు పాఠశాల పైకప్పు లీకేజీ కాకుండా ఉండేందుకు డాంబర్ షీట్లు వేస్తున్నారు. ఈ షీట్లు వేడి చేసేందుకు గృహ అవసరాల కోసం ఉపయోగించే గ్యాస్‌ను నిబంధనలకు విరుద్ధంగా వినియోగిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ ఒక్క చోటే కాకుండా చాలా పాఠశాలల్లో చేపట్టిన పనుల్లో నాణ్యత ప్రశ్నార్థకం మారిందని పలువురు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు పనులు నాణ్యతగా జరిగేలా చూడాలని కోరుతున్నారు.



సంగారెడ్డిలోని రాజంపేట ఉర్దూ హైస్కూల్‌లో అలంకారప్రాయంగా హ్యాండ్ వాష్ నిర్మాణం



సంగారెడ్డి మార్క్స్‌నగర్ ఎంపీపీఎస్ పాఠశాలలో నిర్మించిన నీటి సంపు ప్రారంభించకుండానే బీటలువారిన దృశ్యం

బడులు తెరిచేనాటికి పూర్తి కావాలి : మెదక్ కలెక్టర్

కొల్చారం, మే 23 : అమ్మ ఆదర్శ పాఠశాల కింద చేపడుతున్న పనులను బడులు తెరిచేనాటికి పూర్తయ్యేలా పక్కా ప్రణాళికలతో చేయాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులను ఆదేశించారు. కొల్చారం మండలం పోతంశెట్‌పల్లి క్రాస్‌రోడ్డు, సంగాయిపేట్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో పనులను జిల్లా విద్యాధికారి రాధాకృష్ణతో కలిసి గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పనులు నాణ్యతతో చేయించాలని, ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు. మెదక్ జిల్లాలో ఎంపికైన 562 అమ్మ ఆదర్శ పాఠశాలల్లో 60శాతం పనులు పూర్తయ్యాయని డీఈవో కలెక్టర్‌కు వివరించగా మిగతా పనులు వారంలోగా పూర్తి చేసి పెయింటింగ్ వేయించాలని కలెక్టర్ ఆదేశించారు.

తరుగు.. దోపిడీ!

- బస్తాకు 5 కిలోలు
- హమాలీలకు అదనంగా క్వింటాలుకు రూ.10 వసూలు
- అన్నదాతకు అన్నీ కష్టాలే ..



హనుమాన్‌నగర్‌లోని కొనుగోలు కేంద్రంలో తూకం వేస్తున్న కూలీ

సంగారెడ్డి టౌన్, మే 23 : ధాన్యం కొనుగోళ్లలో అన్నదాతకు కష్టాలు తప్పడం లేదు. పంట చేతికి వచ్చిందన్న సంతోషం కన్నా విక్రయించడం ఎలా అనే ఆందోళన ఎక్కువవుతున్నది. అకాల వర్షాలకు వడ్లు తడిసిపోగా కొనుగోలు కేంద్రాలకు తీసుకువస్తే అడ్డగోలుగా దోచుకుంటున్నారని రైతులు వాపోతున్నారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామంటూనే తేమ ఎక్కువ ఉందని ఒక్కో బస్తాకు ఐదు కిలోల వరకు తరుగు తీస్తున్నారని ఆరోపిస్తున్నారు. దీనికి తోడు హమాలీల ఖర్చు పేరిట అదనంగా వసూలు చేస్తున్నారని వాపోతున్నారు.

సంగారెడ్డి జిల్లావ్యాప్తంగా 211 కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరిస్తున్నారు. ఒక్కో కేంద్రంలో ఒక్కోవిధంగా తరుగు తీస్తున్నారు. కొన్నిచోట్ల 40 కిలోల బస్తాకు 5 కిలోల వరకు తరుగు తీస్తున్నట్టు రైతులు ఆరోపిస్తున్నారు. ఈ లెక్కన క్వింటాలుకు 12 కిలోల వరకు తరుగు రూపంలో తీస్తున్నట్టు తెలుస్తున్నది. ఇదేకాకుండా హమాలీల కొరతను సాకుగా చూపుతూ కేంద్రాల నిర్వాహకులు క్వింటాలుకు అదనంగా రూ. 10 చొప్పున వసూలు చేస్తున్నట్టు తెలిసింది.

ప్రైవేటు వ్యాపారులకు విక్రయం

కొనుగోలు కేంద్రాల్లో అడ్డగోలుగా తరుగు తీస్తుండడంతో రైతులు దళారులను ఆశ్రయిస్తున్నారు. ప్రభుత్వం ఏ-గ్రేడ్ ధాన్యానికి క్వింటాలుకు రూ.2,203, సాధారణ రకానికి రూ.2,183 చెల్లిస్తున్నది. కానీ చెల్లింపులో జాప్యం జరుగుతుండడం, తరుగు, కూలీల రూపంలో వసూలు చేస్తుండడంతో రైతులకు గిట్టుబాటు కావడం లేదని అభిప్రాయం వ్యక్తమవుతున్నది. మరోవైపు వ్యాపారులు పొలం వద్దనే తూకం వేసుకుని, క్వింటాలుకు రూ. 2వేల చొప్పున అక్కడికక్కడే నగదును చెల్లిస్తుండటంతో రైతులు వారికే విక్రయిస్తున్నారు.

97,311 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ

జిల్లావ్యాప్తంగా ఈసారి 1,96,216 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయశాఖ అంచనా వేసింది. ఇప్పటివరకు 19,209 మంది రైతుల నుంచి రూ.214 కోట్ల విలువైన 97,311 మెట్రిక్ టన్నుల వడ్లు సేకరించారు. ఇందులో 87186 మెట్రిక్ టన్నుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఇప్పటివరకు 11,748 మంది రైతులకు 66,958 మెట్రిక్ టన్నుల ధాన్యానికి సంబంధించి రూ.147 కోట్లు చెల్లింపులు జరిగినట్టు సివిల్ సప్లయ్ శాఖ అధికారులు తెలిపారు. ఈనెలాఖరు లోగా కొనుగోళ్లు పూర్తిచేయాలని లక్ష్యాన్ని నిర్దేశించగా ఇప్పటివరకు సంగం మాత్రమే సేకరించడం చూస్తుంటే మిగిలిన పంట వ్యాపారులకు విక్రయించినట్టు తెలుస్తున్నది.



కులబ్‌గూర్‌లో కొనుగోలు కేంద్రం వద్ద ఆరబోసిన వడ్లు

చివరి గింజ సేకరించే వరకు
ధాన్యం కొనుగోళ్లు

- మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

కొల్చారం, మే 23 : జిల్లాలో రైతులు పండించిన చివరి గింజను సేకరించే వరకు కొనుగోలు కేంద్రాలను కొనసాగిస్తమని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. కొల్చారం మండలం వరిగుంతంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సేకరించిన ధాన్యాన్ని వెంటవెంటనే మిల్లులకు తరలించాలని నిర్వాహకులను ఆదేశించారు. కొనుగోలు పూర్తికాగానే ఆన్‌లైన్‌లో ఎంట్రీచేసి రైతుల ఖాతాలో డబ్బులు జమ చేయాలని నిర్దేశించారు. జిల్లాలో ధాన్యం సేకరణ ముమ్మరంగా జరుగుతున్నదని పేర్కొన్నారు. జిల్లాలో ఈసారి యాసంగిలో 410 కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు 52,575 మంది రైతుల నుంచి 2,27,707 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించినట్టు తెలిపారు. ఇప్పటి వరకు రూ.367.23 కోట్లు చెల్లించినట్టు వెల్లడించారు. జిల్లాలో 123 కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు పూర్తయిందని తెలిపారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగుతున్నదని సంతృప్తి వ్యక్తం చేశారు.



పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు : కలెక్టర్

మెదక్ అర్బన్, మే 23: విద్యార్థులు కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తును సొంతం చేసుకోవచ్చని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు కెరీర్ గైడెన్స్, 10/10 జీపీఏ సాధించిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల పంపిణి మెదక్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో గురువారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ 10 జీపీఏ సాధించిన 17 మందికి, 9.8, 9.5 జీపీఏ సాధించిన 381 మంది విద్యార్థులను సత్కరించారు. విద్యార్థి అభిరుచి, సామర్థ్యాన్ని దృష్టిలో పెట్టుకొని తల్లిదండ్రులు ఇంటర్‌లో ఏ గ్రూపులో చేర్పించాలనే విషయమై సలహా ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో డీఈవో రాధాకిషన్, ఎంఈవో నీలకంఠం, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సాధారణ ప్రసవం చేస్తామని
గర్భంలోనే బిడ్డను చంపేశారు

- కాళ్లు పట్టుకున్నా సిజేరియన్ చేయలేదు
- సంగారెడ్డి ఎంసీహెచ్‌లో పసికందు మృతి
- కుటుంబసభ్యుల ఆందోళన

సంగారెడ్డి అర్బన్, మే 22 : సంగారెడ్డి మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో శిశువు మృతి ఘటన ఉద్రిక్తతలకు దారి తీసింది. బాధిత కుటుంబ సభ్యులు, ఆస్పత్రివర్గాలు తెలిపిన వివరాల ప్రకారం సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం కోనాపూర్‌కు చెందిన బేగరి మౌనిక (21) మొదటి కాన్పు నిమిత్తం ఈ నెల 20న సంగారెడ్డి మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో చేరింది. సాధారణ ప్రసవం చేసేందుకు డాక్టర్లు ప్రయత్నాలు ప్రారంభించారు. పురిటినొప్పులతో తీవ్రంగా బాధపడుతుండడం చూసి సిజేరియన్ చేయాలని భర్త మహేశ్‌కుమార్ డాక్టర్లను కోరినా నిరాకరించారు. చివరికి బుధవారం రాత్రి 11 గంటలకు బిడ్డ ఉమ్మనీరు మింగిందని పసికందు చనిపోయిందంటూ కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. సిజేరియన్ చేసి చనిపోయిన ఆడ శిశువును బయటకుతీసి కుటుంబ సభ్యులకు అప్పగించారు. 'కాళ్లు పట్టుకుంటానన్నా సిజేరియన్ చేయలేదని.. డాక్టర్ నువ్వా.. నేనా' అని దురుసుగా సమాధానం చెప్పారని మహేశ్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బిడ్డ చనిపోయిందని చెప్పిన మూడు గంటల తర్వాత మృత దేహాన్ని ఇచ్చారని ఆయన వాపోయారు.

ఆస్పత్రి వద్ద ఆందోళన

సిజేరియన్ చేసి బిడ్డను బతికించాలని వేడుకున్నా వినకుండా సాధారణ ప్రసవం కోసం వేచిచూసి తన బిడ్డను చంపేశారని భర్త మహేశ్‌కుమార్, కుటుంబసభ్యులు ఆస్పత్రి వద్ద బుధవారం అర్ధరాత్రి ఆందోళన చేశారు. తొమ్మిది నెలల స్కానింగ్ సమయంలోనే బిడ్డ మెడకు పేగు చుట్టుకొని



ఉందని, కచ్చితంగా సిజేరియన్ ఆపరేషన్ చేయాలని బయటి డాక్టర్లు చెప్పిన విషయాన్ని కూడా ఇక్కడి డాక్టర్లకు సూచించినా పట్టించుకోలేదని వారు ఆరోపించారు. బయటి దవాఖానాకు తీసుకువెళ్తామని చెప్పినా పంపించలేదని మండిపడ్డారు. ఇదేమిటని అడిగితే కేసు పెట్టుకోవాలని డాక్టర్లు నిర్లక్ష్యంగా సమాధానం చెప్తున్నారని ఆరోపించారు. కాగా, ఆందోళన సమాచారం అందుకున్న పోలీసులు ఆస్పత్రికి చేరుకుని బాధితులకు నచ్చజెప్పారు. ఫిర్యాదు చేస్తే విచారణ చేస్తామని చెప్పడంతో బాధితులు ఆందోళన విరమించారు.

కార్డ్‌ప్రోలాప్స్ వల్లే..

గర్భిణి మౌనికకు సాధారణ ప్రసవం చేయాలని ప్రయత్నించాం. ఈ క్రమంలో కార్డ్‌ప్రోలాప్స్ అడ్డుగా వచ్చి ఒత్తిడి జరగడంతో బిడ్డకు ఆక్సిజన్ అందక మరణించింది. బిడ్డ బతికే ఉండొచ్చన్న ఆశతో చివరి నిమిషంలో సిజేరియన్ చేశాం. కానీ పసికందును కాపాడలేకపోయాం. ఇందులో డాక్టర్ల నిర్లక్ష్యం లేదు. తల్లి క్షేమంగా ఉంది.

-అనిల్‌కుమార్, సూపరింటెండెంట్, జీజీహెచ్



అన్నారంలో ఈదురుగాలులకు ఎగిరిపోయిన ఇంటి పైకప్పు

గాలివాన
బీభత్సం

- ఎగిరిపోయిన ఇంటి పైకప్పు, నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు
- చెట్టు కూలడంతో రాకపోకలకు అంతరాయం

6

మట్టి.. కొల్లగొట్టి

- రైతుల అవసరాల పేరుతో చెరువులను తవ్వేస్తున్నారు
- ఖాళీ స్థలాలు, లేఅవుట్లుకు మట్టి తరలింపు


అంకాపూర్ నబీ చెరువులోని మట్టిని తోడి ట్రాక్టర్లలో నింపుతున్న ఎక్స్‌కవేటర్

నంగునూరు, మే 23 : రైతుల అవసరాల సాకుతో అనుమతి లేకుండానే విచ్చలవిడిగా మట్టి దందా నడుస్తుంది. అధికారుల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండానే చెరువులు, ప్రభుత్వ భూముల్లో మట్టిని కొల్లగొడుతున్నారు. గుట్టుచప్పుడు కాకుండా విక్రయిస్తూ కొందరు అక్రమార్కులు కాసులు పోగేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత శాఖ అధికారులు మాత్రం ఉదాసీనంగా వ్యవహరించడంతో మట్టి వ్యాపారుల ఆగడాలు మితిమీరుతున్నాయి.

నంగునూరు మండల పరిధిలోని మగ్దంపూర్‌లో ఊరచెరువు, అంకాపూర్ గ్రామంలోని నబిచెరువును ఎలాంటి అనుమతులు లేకుండా తవ్వేస్తున్నారు. ట్రాక్టర్లల్లో ఖాళీ స్థలాలు, లేఅవుట్లకు మట్టిని తరలిస్తూ ఒక్కో ట్రిప్పునకు వెయ్యి నుంచి రెండు వేల వరకు వసూలు చేస్తున్నారు. అనుమతి లేకుండా చెరువులో నుంచి మట్టిని తరలించొద్దని, ఒకవేళ తరలిస్తే వాల్టా చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటారని తెలిసినప్పటికీ వ్యాపారులు లెక్కచేయడం లేదు. నంగునూరు చౌడుచెరువు కబ్జాకు గురవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఎలాంటి అనుమతులు లేకుండానే చెరువు చుట్టూ నిర్మాణాలు వెలుస్తున్నాయి. ఈ విషయం పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఫలితం లేకుండా పోయిందని గ్రామస్థులు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో మిషన్ కాకతీయ పేరుతో లక్షలాది రూపాయలు వెచ్చించి చెరువులకు మరమ్మతులు చేపట్టారు. గతేడాది నిండుకుండలాగా చెరువులు దర్శనమిచ్చాయి. ఈసారి కరువు ఏర్పడడంతో చెరువులో నీటి శాతం తగ్గింది. ఇదే అదనుగా మట్టి వ్యాపారులు రంగంలోకి దిగి విచ్చలవిడిగా ఎక్స్‌కవేటర్లతో పెద్ద పెద్ద గోతులు తీస్తూ మట్టిని తరలిస్తున్నారు. రైతులకు ఉపయోగపడే చెరువు నుంచి మట్టి తరలించవద్దని ఆయా గ్రామస్థులు అడ్డు చెప్పినా లెక్కచేయకుండా తోడేస్తున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా తవ్వకాలు చేపడుతున్నా సంబంధిత అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడకపోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం

నంగునూరు మండలంలో చెరువు, కుంటల నుంచి ప్రభుత్వ అనుమతి లేకుండా మట్టితరలిస్తే కఠిన చర్యలు చేపడతాం. చెరువుల్లో మట్టిని కొల్లగొట్టే ప్రయత్నం చేస్తే కేసులు నమోదు చేస్తాం. మగ్దంపూర్, అంకాపూర్ గ్రామాల్లో మట్టి తరలిస్తున్న విషయం మా దృష్టికి రాగానే వెంటనే నిలిపివేయించాం. మట్టి తరలిస్తున్న విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి శాఖ పరమైన చర్యలు తీసుకుంటాం.

– రాజు, ఇరిగేషన్ ఏఈ


మగ్దంపూర్ ఊర చెరువులో తోడుతున్న మట్టి

గాలివాన బీభత్సం

- ఎగిరిపోయిన ఇంటిపైకప్పు, నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు
- చెట్లు కూలడంతో రాకపోకలకు అంతరాయం


కుర్తివాడ వద్ద ప్రధాన రహదారిపై విరిగిపడిన కరెంటు స్తంభం

పాపన్నపేట, మే 23 : మండలంలో గురువారం సాయంత్రం గాలివాన బీభత్సం సృష్టించింది. లక్ష్మీనగర్, యూసుఫ్‌పేట, కుర్తివాడ, మిన్‌పూర్ శివారులో ఈదురుగాలులకు విద్యుత్ స్తంభాలు నేల కూలగా రాత్రి వరకు కరెంటు సరఫరా నిలిచిపోయింది. పలుచోట్ల చెట్లు విరిగిపడగా వాహనాల రాకపోకలు అంతరాయం ఏర్పడింది. అన్నారం గ్రామంలో సత్యనారాయణ ఇంటి పైకప్పులు లేచిపోయి ఊడిపడ్డాయి. ఇదే గ్రామంలో మరో ఇంటిపై కరెంటు స్తంభం విరిగిపడింది. స్థానికులు, సిబ్బంది వాటిని తొలగించే ప్రయత్నం చేశారు. కుర్తివాడ గేటు వద్ద మెదక్-బోడు మెట్పల్లి రహదారిపై చెట్లు కూలిపోయి రాకపోకలకు ఇబ్బంది కలిగింది. కరెంటు స్తంభాలు విరిగిపడ్డాయి. కూలిన స్తంభాలు, చెట్లను తొలగించే పనిలో విద్యుత్ సిబ్బంది నిమగ్నమయ్యారు.


యూసుఫ్‌పేటలో కూలిన పౌల్ట్రీఫాం గోడ, చెల్లాచెదురైన రేకులు


పాపన్నపేటలో రోడ్డుపై పడిన చెట్టును తొలగిస్తున్న విద్యుత్ అధికారులు



PVR సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట 1.35pm | జిఎస్ఎమ్ - మదీనగూడ 2.20pm
PVR ఫోరం మాల్ - కూకట్‌పల్లి 11.05am | నెక్లెస్ సత్య - కవాడిగూడ 11.15am
SKML MOTION PICTURES Through GANESH BHARI 9296509333

పాలిసెట్‌కు ఏర్పాట్లు పూర్తి

- సంగారెడ్డి జిల్లాలో పది, మెదక్ జిల్లాలో 4 పరీక్షా కేంద్రాలు
- సంగారెడ్డిలో హాజరుకానున్న 3,205 మంది విద్యార్థులు
- నిమిషం ఆలస్యంగా వచ్చినా అనుమతి నిరాకరణ

సంగారెడ్డి అర్బన్, మే 23 : మెదక్, సంగారెడ్డి జిల్లాలో నేడు పాలిసెట్‌ను నిర్వహించనున్నారు. పరీక్ష నిర్వహణకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష జరగనున్నది. విద్యార్థులను 10 గంటల నుంచి కేంద్రాల్లోకి అనుమతిస్తారు. 11 గంటల తర్వాత నిమిషం ఆలస్యంగా వచ్చినా అనుతించరు. సంగారెడ్డి పట్టణంలోని ఏడు పరీక్ష కేంద్రాల్లో 2,420 మంది, జహీరాబాద్‌లోని మూడు కేంద్రాల్లో 785 మంది పరీక్షకు హాజరుకానున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలల్లోని మూడు సంవత్సరాల ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్ డిప్లొమా కోర్సులతో పాటు వ్యవసాయ డిప్లొమా, వెటర్నరీ డిప్లొమా ప్రవేశాల కోసం ఈ ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ప్రతి విద్యార్థి హాల్ టికెట్‌లు డౌన్‌లోడ్ చేసుకుని పాస్‌పోర్ట్ సైజు ఫోటో అతికించుకొని గజిటెడ్ అధికారి సంతకంతో కేంద్రాల్లోకి రావాలని అధికారులు సూచించారు. పరీక్ష నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదని, విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్ష రాయాలని, పరీక్షకు మధ్యలో టాయిలెట్‌కు కూడా అనుమతి ఉండదని సంగారెడ్డి కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, జహీరాబాద్ కళాశాల ప్రిన్సిపాల్ కుమారస్వామి స్పష్టం చేశారు.


సంగారెడ్డి పట్టణంలోని ఎస్వీ జూనియర్ కళాశాలలో హాల్‌టికెట్ నంబర్లు వేస్తున్న సిబ్బంది


మెదక్ పట్టణంలోని ఓ పరీక్షా కేంద్రంలో హాల్‌టికెట్ నంబర్లను వేస్తున్న అధికారులు

మెదక్‌లో హాజరుకానున్న 1,590 మంది విద్యార్థులు

మెదక్ అర్బన్: పాలిసెట్ ప్రవేశ పరీక్ష కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మెదక్ ప్రభుత్వ పాలిటెక్నిక్ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ సువర్ణలత తెలిపారు. శుక్రవారం జరుగనున్న పరీక్ష నిర్వహణకు జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన 4 కేంద్రాల్లో 1,590 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1:30 గంట వరకు ఉంటుందన్నారు. నిమిషం ఆలస్యమైనా అనుమతి ఉండదని తెలిపారు.



తూప్రాన్ నలంద కాలేజీలో పరీక్షల నిర్వహణపై సమావేశం, పెద్దశంకరంపేట ప్రభుత్వ కళాశాలలో హాల్‌టికెట్ నంబర్లు వేస్తున్న దృశ్యం

ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

- నేటి నుంచి జూన్ 3 వరకు నిర్వహణ
- మెదక్ జిల్లాలో 22 పరీక్షా కేంద్రాలు
- హాజరుకానున్న 6,110 మంది విద్యార్థులు

మెదక్ అర్బన్, మే 23: ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. జూన్ 3 వ తేదీ వరకు జరిగే ఈ పరీక్షలకు జిల్లా అధికారులు అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం 9 గంటల మధ్యాహ్నం 12 గంటల వరకు ఫస్టియర్, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సెకండియర్ పరీక్షలు జరగనున్నాయి. పరీక్షల కోసం మెదక్ జిల్లా వ్యాప్తంగా 22 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి సత్యనారాయణ తెలిపారు. ప్రథమ సంవత్సరంలో 3,812 మంది, ద్వితీయ సంవత్సరంలో 2,298 మంది మొత్తం 6,110 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. ప్రతీ కేంద్రంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలు నిర్వహించనున్నారు. 22 మంది సీఎస్, 22 డీవోలతోపాటు ఒక ఫ్లయింగ్ స్క్వాడ్ టీం, 4 సిట్టింగ్ స్క్వాడ్, 4 కస్టడీయన్ బృందాలను నియమించామన్నారు. ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు రెండు విడతల్లో పరీక్షలు జరుగుతాయన్నారు. విద్యార్థులకు హాల్ టికెట్లు ఇవ్వకుండా ప్రైవేటు కళాశాలలు వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా నోడల్ అధికారి సత్యనారాయణ హెచ్చరించారు. పరీక్షలకు సంబంధించి ఏమైనా సందేహాలుంటే ఇంటర్ విద్యాధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్ లైన్ కంట్రోల్ రూం నంబర్లు 9603615652, 76710333232 సంప్రదించాలని సూచించారు.

సంగారెడ్డి జిల్లాలో 31 పరీక్షా కేంద్రాలు

సంగారెడ్డి అర్బన్: సంగారెడ్డి జిల్లాలో ఫస్టియర్ 9,318 మంది, ఒకేషనల్ 599 మంది, సెకండియర్‌లో 4,646 మంది, ఒకేషనల్ 323 మంది మొత్తం 14,886 మంది అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలకు హాజరుకానున్నారు. ఇందుకోసం జిల్లా వ్యాప్తంగా 31 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాల సమీపంలో 144 సెక్షన్ అమలులో ఉండనుంది. విద్యార్థులు సంబంధిత వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకొని పరీక్షలకు హాజరుకావాల్సి ఉంటుంది. వాటిపై కళాశాల ప్రిన్సిపాల్ సంతకం లేకున్నా అనుమతిస్తారు. పరీక్షకు గంట ముందుగా విద్యార్థులు కేంద్రాలకు చేరుకోవాలని, ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులు తమ వెంట తీసుకురాకూడదని అధికారులు స్పష్టం చేశారు. పరీక్షల పర్యవేక్షణకు జిల్లా వ్యాప్తంగా పర్యవేక్షణ బృందాలను నియమించారు. పరీక్ష కేంద్రాల్లో ఆరోగ్య సిబ్బంది అందుబాటులో ఉంచనున్నారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో ప్రశ్నాపత్రం తెరుస్తారు. కాగా పరీక్షల నిర్వహణకు సంబంధించి జిల్లా ఇంటర్మీడియట్ శాఖ అధికారులు గురువారం చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. విద్యార్థులకు ఇబ్బందులు ఎదురైతే తమ దృష్టికి తీసుకురావాలని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి ఆర్.గోవిందరామ్ తెలిపారు.

కళ్లల్లో కారం చల్లి వ్యక్తి కిడ్నాప్

- సంగారెడ్డి జిల్లా కల్హేర్‌లో ఘటన


వెంకటేశం (ఫైల్)

కల్హేర్, మే 23: సినీ ఫక్కీలో కళ్లల్లో కారం చల్లి ఓ వ్యక్తిని కిడ్నాప్ చేసిన సంఘటన గురువారం సంగారెడ్డి జిల్లా మండల కేంద్రమైన కల్హేర్‌లో జరిగింది. ప్రత్యక్ష సాక్షి, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని క్రిష్ణాపూర్ గ్రామానికి చెందిన మల్లొడ్డి వెంకటేశం పోలీసు కానిస్టేబుల్‌గా పనిచేసి, ఉద్యోగం నుంచి తొలిగించబడ్డాడు. అనంతరం స్వంత గ్రామం క్రిష్ణాపూర్‌లోనే ఉంటున్నాడు. గురువారం గ్రామానికి చెందిన ఎడ్ల ఆనంద్ అనే వ్యక్తితో కలసి కల్హేర్ తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి భూ సంబంధిత వివరాలు తీసుకున్నాడు. ఆ సమయంలో కార్యాలయ ఆవరణలో ఉన్న వెంకటేశం వద్దకు ఒక మహిళతో పాటు మరో ఇద్దరు వ్యక్తులు వచ్చి మాట్లాడాలని చెప్పి వారితో పాటు తీసుకెళ్లారు. వెంకటేశం, ఆనందర్ ద్విచక్ర వాహనంపై కల్హేర్‌కు సమీపంలోని నల్లవాగు మహారాజ్ బ్రిడ్జి వద్దకు వెళ్లగానే కామారెడ్డి జిల్లా పిట్లం వైపు నుంచి తూఫాన్ వాహనంలో ఆరేడుగురు వ్యక్తులు వచ్చి వెంకటేశం కళ్లల్లో కారం చల్లి దాడి చేశారు. ఆయన వెంట ఉన్న ఆనంద్‌ను ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని బెదిరించారు. అనంతరం అదే వాహనంలో వెంకటేశంను కిడ్నాప్ చేశారు. ఈ విషయాన్ని ఆనంద్ క్రిష్ణాపూర్ గ్రామస్థులకు తెలుపగా.. వారు కల్హేర్ పోలీసులకు సమాచారం అందించారు. కల్హేర్ ఎస్‌ఐ వెంకటేశం కిడ్నాప్ జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. కంగ్టి సీఐ చంద్రశేఖర్‌రెడ్డికి సమాచారమందించడంతో ఆయన కూడా కల్హేర్‌కు చేరుకున్నారు. కామారెడ్డి జిల్లా పిట్లంలో 161వ జాతీయ రహదారి సీసీ కెమెరాలను పరిశీలించారు. కిడ్నాపర్ల ఆచూకీ కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఇదిలా ఉండగా కిడ్నాప్ అయిన వెంకటేశం అక్క, ఆమె కొడుకు ఈ కిడ్నాప్‌లో పాలుపంచుకున్నట్లు తెలిసింది. ఇది వరకు వారి మధ్య గొడవలు జరగడం, పోలీసుల సమక్షంలో పంచాయితీలు జరిగినట్లు తెలిసింది. ఆస్తి తగాదాలు కూడా ఉండడంతో ఆ కోణంలోనే వెంకటేశంను భయపెట్టడానికి కిడ్నాప్ చేసినట్లు పోలీసులు భావిస్తున్నారు.

డీడీల వాపసుకు దరఖాస్తు చేసుకోవాలి

మద్దూరు, మే 23: రెండో విడతలో గొర్రెల యూనిట్ల కోసం డీడీలు చెల్లించిన వారు విత్ డ్రా కోసం దరఖాస్తులు చేసుకోవాలని గురువారం మండల పశువైద్యాధికారి హరికిషన్ తెలిపారు. మండలంలో 318 మంది రెండో విడతలో గొర్రెల యూనిట్ల కోసం దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. డబ్బులు చెల్లించి యూనిట్ రాని వారి నుంచి డీడీ విత్‌డ్రా కోసం దరఖాస్తులు తీసుకుని కలెక్టర్ కార్యాలయానికి పంపిస్తున్నట్లు తెలిపారు. విత్‌డ్రా కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు రెండు వారాల్లోపు వారి బ్యాంకు ఖాతాలో నగదు జమ అవుతుందని తెలిపారు. ఇందుకోసం దరఖాస్తు ఫారం నింపి దానికి ఆధార్ కార్డు, బ్యాంకు పాసుబుక్కు జిరాక్స్ జత చేసి పశువైద్యశాలలో అందజేయాలని సూచించారు. డీడీలు వెనక్కి తీసుకుంటే మళ్లీ గొర్రెల యూనిట్లు వస్తాయో లేదోనన్న ఆందోళన అవసరం లేదని, మళ్లీ గొర్రెల పంపిణీ ప్రారంభిస్తే డీడీలు వెనెక్కి తీసుకున్న వాళ్లకు కూడా గొర్రెలు వస్తాయని తెలిపారు. డీడీలు వెనక్కి తీసుకున్న వారు మరోసారి డీడీలు తీయాల్సి ఉంటుందన్నారు.

ఏరియా ఆసుపత్రిని తనిఖీ చేసిన డీసీహెచ్


ఆస్పత్రి సిబ్బందితో సమావేశమైన డీసీహెచ్‌ఎస్ సంగారెడ్డి

జోగిపేట, మే23: జోగిపేటలోని ఏరియా ఆసుపత్రిని జిల్లా ఆసుపత్రుల సమన్వయ కర్త (డీసీహెచ్‌ఎస్) సంగారెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని అన్ని వార్డులూ తిరిగి, వసతులను పరిశీలించారు. రోగులను సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఎండలు మండుతుండడంతో పాటు అకాల వర్షాల నేపథ్యంలో తరచూ విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్న నేపథ్యంలో ఆసుపత్రిలో ఉన్న జనరేటర్‌ను పరిశీలించారు. అది పనిచేస్తుందా లేదా అన్న విషయాన్ని సూపరింటెండెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. మెరుగైన వైద్య సేవలను అందించాలని, ఆసుపత్రిలో రోగులకు సౌకర్యాలను కల్పించాలని వైద్యులకు సూచించారు. ఆయన వెంట సూపరింటెండెంట్ రమేశ్, వైద్య సిబ్బంది ఉన్నారు.

మాచాపూర్ ఎల్లమ్మ ఆలయంలో చోరీ

చిన్నకోడూరు, మే 23: చిన్నకోడూరు మండలం మాచాపూర్ గ్రామంలోని ఎల్లమ్మ ఆలయంలో దుండగులు బుధవారం అర్ధరాత్రి చోరీకి పాల్పడ్డారు. గౌడ సంఘం సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గొల్లపల్లి స్వరూప రోజు మాదిరిగానే గురువారం ఉదయం ఆలయాన్ని శుభ్రం చేసి పూజ చేయడానికి వెళ్లింది. ఆలయం తలుపులు తెరచి ఉండడంతో లోపలికి వెళ్లి చూడగా అమ్మవారి పుస్తెమట్టెలు, ముక్కు పుడక కనిపించలేదు. హుండీ తాళం పగులగొట్టి హుండీలో ఉన్న సుమారు రూ.10 వేలు దుండగులు ఎత్తుకెళ్లారని తెలిపారు. ఇటీవలే ఆలయ వార్షికోత్సవాలు జరిగాయని వారు తెలిపారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ బాలకృష్ణ తెలిపారు.

దొంగతనం కేసులో జైలు, జరిమానా

సిద్దిపేట రూరల్, మే 23: దొంగతనం కేసులో ముగ్గురు నిందితులకు సిద్దిపేట కోర్టు జూనియర్ సివిల్ న్యాయాధికారి చందన ఆరు నెలల జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ.2వేల చొప్పున జరిమానా విధించినట్లు రూరల్ ఎస్‌ఐ అపూర్వ రెడ్డి గురువారం తెలిపారు. సిద్దిపేట రూరల్ మండలం వెంకటాపూర్ గ్రామంలో 2015లో పొలం పనులు చేసుకుంటున్న అచ్చిని కవిత, ఛత్రి మల్లవ్వ మెడలోని 3.5తులాల బంగారు పుస్తెల తాడు, తులం బంగారు గుండ్లను రేషం జ్ఞానేశ్వర్, గొడుగు శ్రవణ్, ఎర్ర నగేశ్ లాక్కొని ద్విచక్ర వాహనంపై పరారయ్యారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది. ఈ క్రమంలోనే నిందితులకు న్యాయాధికారి జైలు శిక్ష, జరిమానా విధించారు.

ఫసల్ బీమా యోజనపై అవగాహన కల్పించాలి

- సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి



సంగారెడ్డి కలెక్టరేట్‌లో రైతులు, వ్యవసాయాధికారులకు నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి రూరల్, మే 23: ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై), పంట బీమా రైతులకు అందాలంటే ఎలాంటి పంటలు పండించాలో గ్రామ సభలు ఏర్పాటు చేసి రైతులకు అవగాహన కల్పించాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులకు సూచించారు. సంగారెడ్డి కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో గురువారం రైతులు, వ్యవసాయాధికారులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన, పంట బీమా రైతులకు అందాలంటే వారు ఏ పంట పండిస్తున్నారనే వివరాలు పక్కాగా నమోదు చేయాలన్నారు. బీమా యోజన ప్రయోజనాలు రైతులు పొందేలా ఏఈవోలు రైతులను సమన్వయపర్చాలని ఆదేశించారు. అనంతరం రాష్ట్ర వ్యవసాయ శాఖ సంచాలకుడు గోపి మాట్లాడుతూ.. ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంటనష్టం జరిగినప్పుడు రైతులను ఆర్థికంగా ఆదుకునేందుకు పంటల బీమా పథకం, ఫసల్ బీమా యోజన ఎంతగానే ఉపయోగపడుతుందని చెప్పారు. ఈ పథకాలను త్వరలో ప్రారంభమయ్యే వానాకాలం పంటల నుంచి రైతులకు అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని ఆయన తెలిపారు. యూనివర్సల్ కవరేజ్, ఎంపిక చేసిన ప్రాంతాల్లోని పంటలకు బీమా పథకం వర్తింపచేయడం, రైతులకు ఉచిత, రైతుల ప్రీమియం, వాటాను రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందని తెలిపారు. ఈ అవగాహన సదస్సులో మాస్టర్ ట్రైనర్ ద్వారా వివిధ అంశాలపై వ్యవసాయ శాఖాధికారులు రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన జిల్లా వ్యవసాయ శాఖాధికారులు జేడీ నర్సింహారావు, శివప్రసాద్, గోవింద్, సీపీవోలు బాలశౌరి, చంద్రశేఖర్‌ఖ, రాజు, మాన్య, ఉద్యానవనశాఖ అధికారులు సోమేశ్వర్‌రావు, నర్సయ్య, ఏవో ఏవిజీకే ప్రసాద్, ఆదర్శ రైతులు తదితరులు పాల్గొన్నారు.

దేశ సమైక్యతను చాటేందుకు యువకుల సైకిల్ యాత్ర


సైకిల్ యాత్రలో వెంకటేష్, భానుప్రసాద్

మాసాయిపేట, మే 23: దేశ సమైక్యత, సమగ్రతను చాటి చెప్పడానికి సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలానికి చెందిన వెంకటేష్, కర్ణాటకకు చెందిన భానుప్రసాద్ సైకిల్ యాత్ర నిర్వహిస్తున్నారు. గురువారం 44వ జాతీయ రహదారిపై రామంతాపూర్ వద్ద వారు విలేకరులతో మాట్లాడారు. యువతను చైతన్యం చేస్తూ, దేశ సమైక్యతను చాటి చెబుతూ, నూతన ప్రదేశాలను, వ్యక్తులను కలుస్తూ ప్రజా సమస్యలను ప్రభుత్వం, పాలకుల దృష్టికి తేవడానికి యాత్ర చేస్తున్నట్లు తెలిపారు. యువతను చైతన్యం చేయడానికి 3,000 కిలోమీటర్ల మేర నెల రోజుల పాటు అయోధ్య లడక్ వరకు యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

- చీలపల్లిలో ఎడ్లబండ్ల ఊరేగింపు

పెద్దశంకరంపేట, మే 23: పెద్దశంకరంపేట మండల పరిధిలోని చీలపల్లిలో దుర్గమ్మతల్లి జాతరలో భాగంగా ఎడ్లబండ్ల ఊరేగింపు గురువారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి మొక్కులు చెల్లించుకోవడంతో పాటు ప్రత్యేక పూజలు చేశారు.


శివ్వంపేట బగళాముఖి ఆలయంలో మహామంత్ర హవనం

రంగనాయకస్వామి రథోత్సవం

కొల్చారం: కొల్చారం మండలం రంగంపేటలో రంగనాయకస్వామి రథోత్సవం గురువారం తెల్లవారుజామున కనులపండువగా జరిగింది. రంగనాయకస్వామి 688వ పంచాహ్నిక ఉత్సవాల్లో భాగంగా వారం రోజులుగా వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. చివరి ఘట్టమైన రథోత్సవం గ్రామంలోని వీధులు గుండా కొనసాగింది.

ఘనంగా శ్రీలక్ష్మీ సుందరహోమం

వట్‌పల్లి: మండల పరిధిలోని దుద్యాల సర్వేశ్వరపురి క్షేత్రంలో పౌర్ణమిని పురస్కరించుకుని శ్రీలక్ష్మీ సుందరహోమంతో పాటు త్రినాథ వ్రతం ఆశ్రమ పీఠాధిపతి అంబికా శివమణియోగి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

బగళాముఖి ఆలయంలో మహామంత్ర హవనం

శివ్వంపేట: మండల కేంద్రమైన శివ్వంపేటలో కొలువైన శక్తిపీఠం బగళాముఖి అమ్మవారి ఆలయంలో గురువారం పౌర్ణమి సందర్భంగా ప్రధాన పూజారి సంతోష్‌శర్మ ఆధ్వర్యంలో మహామంత్ర హవనం నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ట్రస్ట్ మెంబర్ శివకుమార్‌గౌడ్ భక్తులకు అన్న ప్రసాద వితరణ చేపట్టారు.


పెద్దశంకరంపేట మండలం చీలపల్లిలో ఎడ్లబండ్ల ఊరేగింపు


సర్వేశ్వరపురి క్షేత్రంలో శ్రీత్రినాథ వ్రతం నిర్వహిస్తున్న భక్తులు

నిందితులను పట్టుకోరా?

- ఆలయాల్లో వరుస దొంగతనాలు
- చైన్ స్నాచింగ్‌కు విఫలయత్నాలు
- వ్యవసాయ సామగ్రిని సైతం వదలని దొంగలు
- నెలల నుంచి కొనసాగుతున్న పోలీసుల దర్యాప్తు
- భయపెడుతున్న వరుస దొంగతనాలు

కుకునూరుపల్లి, మే 23: గుడి, బడి, ఇల్లు, వ్యవసాయ భూములు అనే తేడా లేకుండా దుండగులు చోరీలకు పాల్పడుతున్నారు. గత 8 నెలల నుంచి సిద్దిపేట జిల్లా కుకునూరుపల్లి మండలంలో వరుస దొంగతనాలతో ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా పోతున్నది. కానీ కేసులను చేదించడం, నిందితులను పట్టుకోవడంలో పోలీసులు విఫలమయ్యారని స్థానిక ప్రజలు అంటున్నారు.

ఒకే రోజు రెండు ఆలయాల్లో చోరీలు

ఐదు నెలల క్రితం ఒకే రోజు లకుడారం, మెదినిపూర్ గ్రామాల్లోని దండు మైసమ్మ, పెద్దమ్మ ఆలయాల్లో బంగారం, వెండి నగలుతో పాటు అధిక మొత్తంలో నగదును దుండగులు ఎత్తుకెళ్లారు. ఒకే గుడిలో రెండు మూడు సార్లు దొంగతనం జరిగిన సంఘటనలున్నాయి. లకుడారం గ్రామంలోని దండు మైసమ్మ ఆలయంలోనే గత రెండు సంవత్సరాల్లో మూడుసార్లు దొంగతనాలు జరిగాయి. పి.టి వెంకటాపూర్ శివాలయంలో గుడిగంటలను దొంగిలించడానికి ప్రయత్నించిన దుండగుడు గ్రామస్థులకు చిక్కగా వారు దేహశుద్ధి చేసి వదిలిపెట్టారు. చిన్నకిష్టాపూర్ గ్రామంలోని పెద్దమ్మ, దుర్గమ్మ ఆలయాల్లో కొంత నగదును ఎత్తుకెళ్లారు.

పుస్తెలతాళ్ల దొంగతనానికి యత్నం

ఒంటరి మహిళల మెడలో నుంచి పుస్తెలతాళ్లను లాక్కెళ్లేందుకు పలుమార్లు దుండగులు విఫలయత్నం చేశారు. ఏడు నెలల క్రితం మెదినిపూర్ పెట్రోల్‌బంక్ వద్ద రెండుసార్లు చైన్ స్నాచింగ్‌కి ప్రయత్నించారు. లకుడారం మధిర గ్రామమైన కోలోనిపంపుకు రాత్రి 8 గంటల సమయంలో బంధువుల ఇంటి వద్దకు బైక్‌పై వెళ్తున్న మహిళ మెడలోని పుస్తెలతాడును దొంగిలించడానికి ప్రయత్నించగా మహిళ దొంగ కదలికలను పసిగట్టడంతో పరారయ్యాడు. ఈ ఘటనలో బైక్ పైనుంచి మహిళతో పాటు బైక్ నడుపుతున్న వ్యక్తి కింద పడడంతో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మరకముందుకే 15 రోజుల వ్యవధిలో త పస్‌పల్లి గ్రామానికి చెందిన మహిళ మెడలో నుంచి పుస్తెలతాడును దొంగిలించడానికి ప్రయత్నించి మరోమారు దొంగలు విఫలమయ్యారు. నాలుగు నెలల క్రితం బొబ్బాయిపల్లిలో వ్యవసాయ పొలం వద్దకు వెళ్లి వస్తున్న తూమ్ బాలమణి మెడలో నుంచి నాలుగు తులాల బంగారాన్ని బైక్‌పై వచ్చి లాక్కెళ్లారు. 15 రోజుల వ్యవధిలో కోనాయిపల్లికి చెందిన మహిళ మెడలో నుంచి పుస్తెలతాడును ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నించి దొంగలు విఫలమయ్యారు.


రెండుసార్లు వరుస దొంగతనాలు జరిగిన కుకునూరుపల్లి మండలం మేదినీపూర్ గ్రామంలోని పెద్దమ్మ ఆలయం(ఫైల్)

వ్యవసాయ సామగ్రినీ వదలరు..

గడిచిన సంవత్సరం నుంచి కుకునూపల్లి మండలంలోని వ్యవసాయ బావుల వద్ద ఉన్న సామగ్రిని దుండగులు ఎత్తుకెళ్లారు. బోరు పైపులు, బోరు మోటార్లు, కేబుల్‌వైర్లు, ఇతర వ్యవసాయ సామగ్రిని దొంగలించారు. పలు ఇళ్లల్లో కూడా సంవత్సర కాలంగా దొంగతనాలు జరిగాయి. మాత్‌పల్లి, కుకునూరుపల్లి, బొబ్బాయిపల్లి గ్రామాల్లో దొంగతనాలకు ప్రయత్నాలు జరిగాయి. కొన్నిళ్లలో నగదు, బంగారాన్ని దుండగులు ఎత్తుకెళ్లారు.

కొనసాగుతున్న దర్యాప్తులు

ఆలయాలు, చైన్ స్నాచింగ్, పలు గ్రామాల్లో చోరీలు, వ్యవసాయ బోర్ల వద్ద దొంగతనాలు జరుగుతున్నప్పటికీ కేసులు మాత్రమే నమోదు అవుతున్నాయి. వాటిని పరిష్కరించడంలో పోలీసులు విఫలమయ్యారని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటివరకు ఒక్క కేసు దర్యాప్తు కూడా పూర్తి కాలేదు. ఒక్క నిందితుడిని కూడా పట్టుకున్న దాఖలాలు లేవు. వరుస దొంగతనాలతో మండల ప్రజలు భయబ్రాంతులకు గురవుతున్నారు. ఎక్కడ ఎప్పుడు ఏ దొంగతనం జరుగుతుందో అని భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా పోలీసులు నిఘా పెంచి నిందితులను పట్టుకోవాలని కోరుతున్నారు.

నిందితులను పట్టుకుంటాం

గత మూడు నెలల కాలం నుంచి 70 కేసులను ఛేదించాం. పాత కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టి దర్యాప్తు చేస్తున్నాం. తప్పకుండా నిందితులను పట్టుకుంటాం. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలి. గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. కొత్త వ్యక్తులు ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలి.

- పి.శ్రీనివాస్, ఎస్‌ఐ, కుకునూరుపల్లి

బస్టాండ్‌ను ఆక్రమించి.. చలివేంద్రంగా మార్చి..!

● బస్టాండ్ లేక చెట్టునీడలో ప్రయాణికుల నిరీక్షణ

సంగారెడ్డి రూరల్, మే 23: సంగారెడ్డి మండలం ఇస్మాయిల్‌ఖాన్‌పేట గ్రామంలోని ప్రధాన రహదారిపై ఉన్న బస్టాండ్‌ను అక్రమార్కులు చలివేంద్రంగా మార్చేశారు. సంగారెడ్డికి వెళ్లేందుకు ఇస్మాయిల్‌ఖాన్‌పేట, గౌడిచర్ల, బ్యాతోల్, ఎర్దనూర్ గ్రామాలకు చెందిన ప్రజలు వివిధ పనుల నిమిత్తం ఇక్కడికి వస్తారు. నర్సాపూర్ వైపు నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు నిలిపి ప్రయాణికులను ఎక్కించుకుని వెళ్తాయి. అయితే బస్టాండ్ నిర్మించిన కొత్తలో ప్రయాణికులు అందులోనే కూర్చుని బస్సుల కోసం నిరీక్షించేవారు. కొంతకాలం తరువాత కొందరు బస్టాండ్‌ను వేసవిలో చలివేంద్రంగా మార్చేశారు. ప్రస్తుతం ఎండాకాలం వెళ్లిపోయినా చలివేంద్రాన్ని తొలగించకుండా బస్టాండ్ చుట్టూ ఇనుప కడీలతో గోడ, తలుపులు నిర్మించి తాళాలు వేసి ఆక్రమించుకున్నారు. ప్రజావసరాల కోసం నిర్మించిన బస్టాండ్‌ను కొందరు చలివేంద్రం ఏర్పాటు చేసి పూర్తిగా స్వాధీనం చేసుకోవడంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. బస్సుల కోసం వేచిచూసేందుకు బస్టాండ్ లేక ప్రయాణికులు పక్కనే ఉన్న రాగి చెట్టు వద్ద బస్సు కోసం నిరీక్షిస్తున్నారు. చలివేంద్రాన్ని తొలగించి బస్టాండ్‌ను వినియోగంలోకి తీసుకురావాలని ప్రయాణికులు కోరుతున్నారు.




ఇస్మాయిల్‌ఖాన్‌పేట చౌరస్తాలోని బస్టాండ్‌ను చలివేంద్రంగా మార్చిన దృశ్యం, రాగిచెట్టే ప్రయాణికులకు బస్టాండ్

ఆర్టీసీ సిబ్బందికి వైద్య పరీక్షలు

నారాయణఖేడ్, మే 23: గ్రాండ్ హెల్త్ ఛాలెంజ్ ప్రోగ్రాంలో భాగంగా ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఆదేశాల మేరకు గురువారం మూడోరోజున ఖేడ్ డిపో ఆవరణలో సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ డీఎం మల్లేశయ్య సైతం డ్రైవర్లు, కండక్టర్లతో కలిసి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అన్ని విభాగాల సిబ్బందికి 13 రకాల పరీక్షలు నిర్వహించినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు.

పెట్రోల్ బంక్‌ను పరిశీలించిన తూనికల కొలతల అధికారి

శివ్వంపేట, మే 23: పెట్రోల్ బంకులో మోసం చేస్తున్నారని వినియోగదారులు ఫిర్యాదు చేయడంతో గురువారం భారత్ పెట్రోల్ బంక్‌ను జిల్లా తూనికల కొలత అధికారి సుధాకర్ గురువారం తనిఖీ పరిశీలించారు. శివ్వంపేటకు చెందిన ఇద్దరు పెట్రోల్ పోయించుకోగా.. తక్కువ రావడంతో తూనికల కొలత అధికారికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ ఐదు లీటర్లకు 20 మిల్లీ లీటర్లు పెట్రోల్, డీజిల్ తక్కువ వస్తున్నట్లు గుర్తించినట్లు చెప్పారు. బంక్‌లో పూర్తి పరిశీలన చేసిన తర్వాతే పెట్రోల్ బంక్‌ను తెరవాలని బంక్ సిబ్బందికి తెలిపామన్నారు.

జహీరాబాద్ అసెంబ్లీ కన్వీనర్‌గా నౌబాద్ జగన్

జహీరాబాద్, మే 23: జహీరాబాద్ అసెంబ్లీ కన్వీనర్‌గా నౌబాద్‌జగన్‌ను నియమిస్తూ బీజేపీ అధిష్ఠానం గురువారం ఉత్తర్వులు జారీచేసింది. ఇప్పటివరకు జిల్లా ప్రధాన కార్యదర్శిగా కొనసాగిన నౌబాద్ జగన్ ప్రస్తుతం జహీరాబాద్ అసెంబ్లీ కన్వీనర్‌గా నియామకమయ్యారు. తనకు జహీరాబాద్ నియోజకవర్గ బాధ్యతలను అప్పగించిన బీజేపీ అధిష్ఠానం ముఖ్య నాయకులకు, కార్యకర్తలకు ప్రత్యేక కృతజ్ఞతలు చెప్పారు.

జనుము, జీలుగ విత్తనాలు పంపిణీ

టేక్మాల్/చేగుంట, మే 23: మండల కేంద్రమైన టేక్మాల్‌లోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలో జీలుగు విత్తనాలను మండల వ్యవసాయ అధికారి రాంప్రసాద్ రైతులకు అందజేశారు. నార్సింగి మండలంలో గురువారం అగ్రోస్ రైతు సేవా కేంద్రం వద్ద సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేశారు. చేగుంట రైతు ఆగ్రోస్ సేవా కేంద్రం వద్ద వ్యవసాయాధికారి హరిప్రసాద్ జనుము విత్తనాలను పంపిణీ చేశారు.

రోగులకు పండ్లు పంపిణీ

నారాయణఖేడ్, మే 23: స్థానిక ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి సతీమణి పట్లోళ్ల అనుపమ్మరెడ్డి తన జన్మదినాన్ని పురస్కరించుకొని గురువారం ఖేడ్‌లోని ఏరియా వైద్యశాలలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.

బాల హనుమాన్ జయంతి

నర్సాపూర్, మే 23: నర్సాపూర్ పట్టణంలోని 7వ వార్డులో వెలసిన బాల హనుమాన్ జయంతిని గురువారం నిర్వహించారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ పూజలో మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, కౌన్సిలర్ రుక్కమ్మ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

జిన్నారం/చేగుంట, మే 23: బొల్లారం మున్సిపాలిటీలో మరమ్మతుల కోసం గురువారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు అధికారులు తెలిపారు. బొల్లారంలోని ఓల్డ్ విలేజ్, జ్యోతినగర్ కాలనీ, ట్యాంకు ఏరియా, 11కేవీ ఫీడర్ పరిధిలో ఉదయం 11 గంటల నుంచి 12.30 గంటల వరకు సరఫరా నిలిపేస్తున్నట్లు తెలిపారు. అలాగే చేగుంట 133 కేవీ సబ్ స్టేషన్ మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం ఉదయం 9 నుంచి 1 గంటల వరకు చేగుంట, అనంతసాగర్, కర్నాల్‌పల్లి సబ్‌స్టేషన్లతో పాటు పరిశ్రమలకు విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు ఏఈ రాములు తెలిపారు.

నేడు ఆయిల్‌పామ్ సాగుపై సమావేశం

మాసాయిపేట, మే 23: ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించేందుకు శుక్రవారం మాసాయిపేటలో సమావేశం నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయ విస్తరణ అధికారి రజిత తెలిపారు. ఆయిల్‌పామ్ పంటలపై ఆసక్తి ఉన్న రైతులు సమావేశానికి హాజరుకావాలని కోరారు.

ప్రతిఒక్కరూ భక్తిమార్గంలో ప్రయాణించాలి: ఎమ్మెల్యే

వెల్దుర్తి, మే 23: ప్రతిఒక్కరూ భక్తిమార్గంలో ప్రయాణించాలని, అప్పుడే మానసిక ప్రశాంతత కలుగుతుందని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. గురువారం వెల్దుర్తి పట్టణ ఉపాధ్యక్షుడు శ్రావణ్‌కుమార్ ఇంట్లో నిర్వహించిన ఆంజనేయస్వామి పడిపూజకు ఆమె హాజరై మాట్లాడారు. దైవ చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తున్నదని చెప్పారు. ఆంజనేయస్వామి దీవెనలతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని కోరినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అలాగే మండల పరిధిలోని శెట్టిపల్లికలాన్‌లోని పెద్దమ్మతల్లి ఆలయ ప్రథమ వార్షికోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ రమేష్‌గౌడ్, వెల్దుర్తి ఎంపీటీసీ మోహన్‌రెడ్డి, మెదక్ మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కృష్ణగౌడ్, పార్టీ మండల ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, వెల్దుర్తి పట్టణ అధ్యక్షుడు గంగాధర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



పడిపూజలో ఎమ్మెల్యే సునీతారెడ్డి

మంత్రి కోమటిరెడ్డిని కలిసిన ఖేడ్ ఎమ్మెల్యే

నారాయణఖేడ్/జహీరాబాద్, మే 23: రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని గురువారం ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి, తన సోదరుడు, డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి హైదరాబాద్‌లోని మంత్రి నివాసానికి వెళ్లి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ఆర్‌అండ్‌బీ, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి జన్మదినం సందర్భంగా టీఎఫ్‌డీసీ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు సిద్ధం ఉజ్వల్‌రెడ్డి మంత్రి నివాసంలో పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.



కోమటిరెడ్డికి పుష్పగుచ్ఛం ఇచ్చి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలి

● నెలవారి సమీక్షలో మెదక్ ఎస్పీ బాలస్వామి

మెదక్ అర్బన్, మే 23: పెండింగ్ కేసుల దర్యాప్తు త్వరగా పూర్తిచేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయాలని మెదక్ ఎస్పీ బాలస్వామి పోలీసు అధికారులకు సూచించారు. గురువారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో నెలవారి నేరు సమీక్ష నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న కేసుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. జూన్ 8న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ శాతం కేసులు పరిష్కరించే దిశగా చొరచూపాలన్నారు. పోక్సో కేసులపై ప్రత్యేక దృష్టిసారించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అన్ని స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాల ఏర్పాటు చేసుకునేందుకు దాతలు ముందుకు రావాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ మహేందర్, డీఎస్పీలు రాజేష్, సుభాష్‌చంద్రబోస్, జిల్లాలోని సీఐ, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న ఎస్పీ బాలస్వామి

దర్శకుడిగా సంగారెడ్డి వాసి సతీష్‌రాజ్

సంగారెడ్డి రూరల్, మే 23: సంగారెడ్డి మండలం ఫసల్‌వాడి గ్రామానికి చెందిన సతీష్‌రాజ్ దర్శకునిగా సినీ ఇండస్ట్రీలో తెరంగ్రేటం చేయనున్నారు. కొరియోగ్రాఫర్‌గా తన కెరీర్‌ను ప్రారంభించి దర్శక బాధ్యతలు చేపట్టబోతున్నారు. మొదటి చిత్రానికి దర్శకత్వం వహిస్తున్న ఎస్ఆర్ మూవీ జంక్షన్ బ్యానర్‌ను గురువారం హైదరాబాద్‌లో సినీనటుడు మురళీమోహన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సతీష్‌రాజ్ సాయిబాబ భక్తుడు అవడంతో స్వీయ దర్శకత్వంలో సినిమా ప్రారంభించే తన ఇష్టదైవమైన సాయిబాబాకు అంకితం ఇవ్వాలనే ఆశయంతో 'శ్రద్ధ సబూరి' పేరుతో ఓ పాటను రూపొందించారన్నారు. సినీ పరిశ్రమలో ప్రతిభావంతులైన కొరియోగ్రాఫర్లు అనేకమంది ఉన్నారని, వారిలో ఇప్పుడు సతీష్‌రాజ్‌కు దర్శకుడిగా మారడం అనందంగా ఉన్నదన్నారు. అనంతరం డీసీసీబీ ఉమ్మడి మెదక్ జిల్లా వైస్ చైర్మన్ మాణిక్యం మాట్లాడుతూ తమ గ్రామానికి చెందిన సతీష్‌రాజ్ కొరియోగ్రాఫర్ నుంచి దర్శకుడి స్థాయికి ఎదగడం ఎంతో గర్వకారణమన్నారు. కార్యక్రమంలో సంగీత దర్శకుడు చరణ్‌అర్జున్, దర్శకుడు చంద్రమహేష్, నటీనటులు పాల్గొన్నారు.



హైదరాబాద్‌లో ఎస్ఆర్ మూవీ జంక్షన్ బ్యానర్ లోగోను ఆవిష్కరిస్తున్న సినీనటుడు మురళీమోహన్

గౌతమబుద్ధుడి ఆశయ సాధన దిశగా నడుచుకుందాం

● అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ప్రొఫెసర్ సుధారాణి

జహీరాబాద్, మే 23: విశ్వశాంతి ప్రబోధకుడు, గౌతమబుద్ధుడి ఆశయసాధన దిశగా మనందరం నడుచుకుందామని అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ప్రొఫెసర్ సుధారాణి పేర్కొన్నారు. గురువారం జహీరాబాద్‌పట్టణంలో, మండలంలోని బూచనెల్లి గ్రామంలో గౌతమ బుద్ధుడి జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఆధ్యాత్మిక గురువులలో గౌతమబుద్ధుడు ఒకరని తెలిపారు. జహీరాబాద్ ప్రాంతంలో గౌతమ బుద్ధుడికి సంబంధించిన కార్యక్రమాలను చేపట్టడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా జహీరాబాద్ పట్టణంలో పలువురు నాయకులు, అభిమానులు శాంతి కపోతాలను గాల్లోకి ఎగురవేశారు.



జహీరాబాద్‌లో శాంతి కపోతాలను ఎగురవేస్తున్న నాయకులు

వ్యవసాయ పనుల్లో రైతులు నిమగ్నం



ట్రాక్టర్లతో పొలాలను చదును చేస్తున్న దృశ్యం

మునిపల్లి, మే 23: మండలంలోని అన్ని గ్రామాల్లో ఇటీవల కురిసిన వర్షాలకు ఖరీఫ్ వ్యవసాయ పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. ట్రాక్టర్లతో దుక్కి దున్నుతూ పొలాలను చదును చేసుకుంటున్నారు. మృగశిర కార్తె రాకముందే పొలం పనులను చకచకా చేసుకుంటూ జూన్‌లో కురిసే తొలకరి వర్షాలకే విత్తనాలను వేసేందుకు సిద్ధం చేసుకుంటున్నారు. మండలవ్యాప్తంగా మొత్తం 38 వేల ఎకరాల విస్తీర్ణం ఉండగా.. ఇందులో 35వేల వరకు పత్తి పంటను రైతులు సాగు చేయనున్నట్లు ఏవో శివకుమార్ తెలిపారు.

వర్షాకాలానికి మొక్కలు సిద్ధం చేయండి



మరవెల్లిలోని నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న డీపీవో సాయిబాబా

వట్‌పల్లి, మే 23: నర్సరీలో పెంచుతున్న మొక్కలను వర్షాకాలం నాటికి పూర్తిస్థాయిలో పెంచి సిద్ధం చేయాలని డీపీవో సాయిబాబా అన్నారు. గురువారం మండల పరిధిలోని మరవెల్లిలో డంపింగ్‌యార్డు, నర్సరీ, వైకుంఠధామాలను పరిశీలించి మాట్లాడారు. నర్సరీలో పెంచుతున్న మొక్కలపై నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత ఉద్యోగులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో యూసుఫ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



పాపన్నపేట మండలం కొడుపాకలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

అధైర్య పడకండి.. చివరి గింజ వరకూ కొంటాం

● మెదక్ అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

పాపన్నపేట/నారాయణఖేడ్, మే 23: అధైర్య పడకండి.. ఈ నెలాఖరు వరకు చివరి గింజవరకూ కొనుగోలు చేస్తామని మెదక్ అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం ఆయన మండలంలోని కొడుపాక గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి మాట్లాడారు. ధాన్యం కొనుగోలు విషయంలో రైతులు అధైర్యపడద్దని చెప్పారు. జిల్లాలో ధాన్యం సేకరణ ఈనెలాఖరు వరకు పూర్తిచేస్తామన్నారు. ధాన్యం కొనుగోలులో రవాణా కోసం ఇతర జిల్లాల నుంచి అదనపు వాహనాలు తెప్పించామన్నారు. నారాయణఖేడ్ మండల పరిధిలోని జూకల్ శివారులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం డిప్యూటీ తహసీల్దార్ అనుదీప్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన వెంట ఆర్ఐ.శ్యాంరావు, తదితరులు ఉన్నారు.

ఉపాధిహామీ కూలీల నిరసన

శివ్వంపేట, మే 23: అధికారుల పర్యవేక్షణ లోపంతో ఉపాధిహామీలో చేసిన పనులకు తక్కువ రోజుల బిల్లు చేయడంతో తాము నష్టపోతున్నామని పలువురు కూలీలు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం అల్లీపూర్ పలువురు ఉపాధిహామీ కూలీలు నిరసన తెలిపారు. ఉపాధి కూలి యాదగిరి మాట్లాడుతూ లొద్దిలోనికుంటలో ఆరురోజులు పనిచేస్తే నాలుగురోజులకు మాత్రమే బిల్ చేశారని, 14 వారాలు పనిచేస్తే ఒక్కసారి మాత్రమే వేతన స్లిప్పులు ఇచ్చారని ఆరోపించారు. అధికారులు స్పందించి అవకతవకలకు పాల్పడుతున్న వ్యక్తులపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని కోరారు.

అసంపూర్తిగా డబుల్ రోడ్డు పనులు

● కాసుకుంట-గుమ్మడిదల రోడ్డుకు ఎమ్మెల్యే శంకుస్థాపన

● ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు

గుమ్మడిదల, మే 22: గతేడాది క్రితం ప్రారంభించిన కానుకుంట-గుమ్మడిదల డబుల్ రోడ్డు పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. సింగిల్ రోడ్డు మూలంగా వాహనాల రద్దీ పెరిగి తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, డబుల్ రోడ్డుగా మార్చాలని ప్రజలు విజ్ఞప్తి చేయడంతో కానుకుంట- గుమ్మడిదల వరకు ఏడు కిలోమీటర్ల వరకు డబుల్ రోడ్డుగా మారుస్తూ గతేడాది ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ పనులకుగానూ ప్రభుత్వం నుంచి రూ.1.50 లక్షలు, జీఎంఆర్ ఎంటర్‌ప్రైజెస్ నుంచి రూ.7.50 కోట్ల సొంత నిధులను కేటాయించారు. ప్రారంభంలో పనులు చకచకా జరిగినా కొన్నినెలల తర్వాత నిలిచిపోయాయి. పనుల్లో భాగంగా రోడ్డుకు ఇరువైపులా వెడల్పు కోసం తీసిన గుంతల్లో కంకర వేశారు. ప్రస్తుతం ఆ కంకర తేలి వాహనదారులకు ఇబ్బందిగా మారింది. రాత్రివేళల్లో వాహనాలు ఓవర్ టేక్ చేయబోయి గుంతలు కనిపించక ప్రమాదాలు సంభవిస్తున్నాయి. అత్యవసర పరిస్థితుల్లో ఇతర ప్రాంతాలకు వెళ్లాలంటే.. రోడ్డు బాగలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి స్పందించి కానుకుంట-గుమ్మడిదల డబుల్ రోడ్డు పనులను పూర్తిచేసి ప్రజల ఇబ్బందులు తొలగించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.



నిలిచిపోయిన కానుకుంట గుమ్మడిదల డబుల్ రోడ్డు పనులు

రోడ్డు పనులను పూర్తి చేయాలి



కానుకుంట-గుమ్మడిదల డబుల్ రోడ్డు నిర్మాణ పనులు అర్ధాంతంగా ఆగిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రాజకీయాలు పక్కనపెట్టి ప్రజల అవసరాలను గుర్తించాలి. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డు పనులను పూర్తి చేయాలి.

- విప్ప రాంరెడ్డి, అనంతరం

ఆటో కార్మికులు నష్టపోతున్నారు

కానుకుంట-గుమ్మడిదల ప్రధాన రహదారి డబుల్ రోడ్డు పనులు అర్ధాంతరంగా నిలిచిపోవడంతో రోడ్డు ఇరుపక్కల పోసిన కంకర తేలి వాహనదారులకు ఇబ్బందిగా తయారైంది. గుంతల రోడ్లపై ఆటోలు నడుపుతుండడంతో సంపాదన మొత్తం మరమ్మతులకే పోతోంది.

- గుండగల వెంకటేశం, ఆటో కార్మికుల సంఘం మండల నాయకుడు, కానుకుంట

ఈ రోడ్డు నరకాన్ని తలపిస్తున్నది

గుమ్మడిదల-కానుకుంట ప్రధాన రహదారి గుంతలమయంగా మారి నరకాన్ని తలపిస్తున్నది. ఈ రోడ్డుపై వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ఎమ్మెల్యే వెంటనే స్పందించి రోడ్డును పూర్తి చేసి ప్రజల ఇబ్బంది తొలగించాలి.

- పాండు, గుమ్మడిదల

ఎద్దు దాడిలో గాయపడిన రైతు మృతి

చిన్నశంకరంపేట, మే 23: ఎద్దు దాడిలో గాయపడిన రైతు చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్ఐ నారాయణగౌడ్ వివరాల ప్రకారం.. చిన్నశంకరంపేట మండలం ఖాజాపూర్‌తండాకు చెందిన రైతు ధరావత్ చత్రియ(45) గత 20 రోజుల క్రితం తన పశువులను మేత కోసం పొలం వద్దకు తీసుకెళ్లాడు. పశువులను మేపుతున్న క్రమంలో ఒక ఎద్దు అతడిపై కొమ్ముతో దాడిచేయగా తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం లక్ష్మక్కపల్లిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతిచెందాడు. మృతుడికి భార్య ధరావత్ లక్ష్మి, పిల్లలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.



చత్రియ మృతదేహం

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

హవేళిఘణపూర్, మే 23: పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. హవేళిఘణపూర్ మండలం బొగుడభూపతిపూర్ గ్రామానికి చెందిన మంగళి యాదగిరి(26) కుల వృత్తితో పాటు వ్యవసాయం చేస్తూ జీవించేవాడు. మానసిక స్థితి బాగాలేక ప్రతీ చిన్న విషయానికి చస్తానని బెదిరించేవాడు. గతంలో చాలాసార్లు ఆత్మహత్య చేసుకునేందుకు యత్నించాడు. కాగా గురువారం కుటుంబీకులు ఎవరూ లేకపోవడంతో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య గీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ రాజు తెలిపారు.

బైక్‌ను ఢీకొన్న కారు, మహిళ మృతి

హవేళిఘణపూర్, మే 23: బైక్‌ను కారు ఢీకొనడంతో మహిళ మృతిచెందింది. ఈ సంఘటన ఔరంగాబాద్‌తండా శివారులో గురువారం చోటు చేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హవేళిఘణపూర్‌కు చెందిన గంగిరెడ్డుల రేణుక(30) భర్త అంబయ్యతో కలిసి బైక్‌పై ఔరంగాబాద్‌తండాకు వెళ్లి వస్తున్నారు. తండా శివారుకు రాగానే ఎదురుగా వస్తున్న కారు వీరి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో ఇద్దరూ కిందపడ్డారు. రేణుక తలకు, కాలుకు బలమైన గాయం కావడంతో చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. మృతురాలికి ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ రాజు తెలిపారు.

రోడ్డు పక్కన నీరసంగా గుర్తు తెలియని వ్యక్తి

● ఆస్పత్రిలో చేర్పించగా.. చికిత్స పొందుతూ మృతి

నర్సాపూర్, మే 23: నర్సాపూర్ మండలం రెడ్డిపల్లి బస్టాండ్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి నీరసంగా, అనారోగ్యంతో బాధపడుతుండగా.. గమనించిన స్థానికులు ఆస్పత్రిలో చేర్పించారు. అయితే ఆ వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్ఐ పుష్పరాజ్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లేకపోగా.. మతిస్థిమితం కూడా లేదని చెప్పారు. ఈ మేరకు మృతదేహాన్ని స్థానిక ఆస్పత్రిలోని మార్చురీలో భద్రపరిచామని, తెలిసినవారు ఉంటే నర్సాపూర్ పోలీసులను సంప్రదించాలని ఎస్ఐ సూచించారు.



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

విద్యుదాఘాతంతో మూడు పాడిగేదెలు మృతి

టేక్మాల్ మే 23: విద్యుదాఘాతంతో మూడు పాడిగేదెలు మృతిచెందాయి. బుధవారం రాత్రి మండలంలో వీచిన ఈదురుగాలులకు విద్యుత్ స్తంభం వైరు తెగి పడిపోయింది. టేక్మాల్‌లోని రైతు అక్కేల మల్లేశం, నడిలా శంకర్‌కు చెందిన మూడు పాడిగేదెలు నిమ్మళ్ల బావి సమీపంలో మేతకు వెళ్లి విద్యుదాఘాతానికి గురై మృతిచెందాయి. రెండేళ్ల నుంచి విద్యుత్ వైర్లు వేలాడుతున్నా.. అధికారులు సరిచేయలేదని రైతులు తెలిపారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్ల సుమారు రూ.2.50 లక్షల నష్టం జరిగిందని, తమకు న్యాయం చేయాలని బాధిత రైతులు వేడుకున్నారు.



మృతిచెందిన పాడిగేదెలు

'ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు వేతనాలు చెల్లించాలి'

సంగారెడ్డి అర్బన్, మే 23: వైద్య ఆరోగ్యశాఖలో జాతీయ ఆరోగ్య మిషన్(ఎన్‌హెచ్‌ఎం) కింద పనిచేస్తున్న ఉద్యోగులకు వేతనాలు ఇవ్వాలని మెడికల్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం డీఎంహెచ్‌వో కార్యాలయం ఏవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మెడికల్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి యాదగిరి మాట్లాడుతూ మూడునెలలుగా వేతనాలు రాక ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని, పస్తులుండే పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రతినెల 5వ తేదీలోగా వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు రాజు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

సన్‌రైజ్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉత్సాహంగా 5కే రన్




5కే రన్ నిర్వహిస్తున్న సన్‌రైజ్ ఆస్పత్రి డాక్టర్లు, సిబ్బంది

సంగారెడ్డి అర్బన్, మే 23: సంగారెడ్డి కలెక్టరేట్ సమీపంలోని సన్‌రైజ్ ఆస్పత్రి ఆధ్వర్యంలో గురువారం ఉదయం 5కే రన్‌ను ఉత్సాహంగా నిర్వహించారు. స్థానిక ఆస్పత్రి నుంచి పాత బస్టాండ్ వరకు ఈ రన్ కొనసాగింది. ఈ సందర్భంగా ఆస్పత్రి డాక్టర్ స్వామిగౌడ్ మాట్లాడుతూ నిత్యం జీవనశైలిలో మార్పు వల్ల తాజాగా 18 ఏళ్లు పైబడిన వారు కూడా బీపీ బారినపడటం దురదృష్టకరన్నారు. వయస్సుతో సంబంధం లేకుండా చిన్నా, పెద్ద తేడా లేకుండా బీపీ అందరికి వస్తుందని, ఈ నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉన్నదన్నారు. ఇందుకోసం ప్రతిరోజు సుమారు 40 నిమిషాలు వ్యాయామం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో యాజమన్యం సంతోష్‌కుమార్‌గౌడ్, డాక్టర్లు మల్లిక, మహేశ్, సాయివెంకటేశ్, సువర్ణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బొల్లారం కుడికుంట శిఖంలో అక్రమ నిర్మాణాలు

● కలెక్టరేట్, మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు

జిన్నారం, మే 23: బొల్లారం మున్సిపాలిటీ 132 సర్వే నెంబరు కుడికుంటలో అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కార్యాలయంలో, అనంతరం బొల్లారం మున్సిపల్ కమిషనర్ మంగ తాయారుకు బీఆర్ఎస్ నాయకులు ఫిర్యాదు చేశారు. కుడికుంటలో అధికార పార్టీకి చెందిన కొందరు నాయకులు భారీ షెడ్లు నిర్మించి, ఇతరులకు లీజుకు ఇచ్చారని ఫిర్యాదులో పేర్కొన్నారు. గతంలో అక్కడ నిర్మాణాలను రెవెన్యూ అధికారులు కూల్చివేయగా.. అధికారాన్ని అడ్డు పెట్టుకొని కాంగ్రెస్ నాయకులు నిర్మాణాలు జరిపి శిఖం భూములు ఆక్రమించారని, వీటిపై వెంటనే చర్యలు చేపట్టాలని కోరారు.



మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్న నాయకులు

'కొలతల ప్రకారం ఉపాధిహామీ పనులు చేయించాలి'

కంగ్టి/నాగల్‌గిద్ద, మే 23: ఉపాధిహామీ పథకంలో కొలతల ప్రకారం కూలీలకు పనులు చేయించాలని ఎంపీడీవో సత్తయ్య తెలిపారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. నర్సరీలలో మొక్కల సంరక్షణ పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. గ్రామాల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే నాగల్‌గిద్ద మండల పరిధిలోని ముక్తాపూర్‌లో ఉపాధిహామీ పనులను గురువారం నాగల్‌గిద్ద ఏపీవో మురళీకృష్ణ పనులను పరిశీలించారు. ఆయన వెంట టీఏ సోనేష్, మోహన్ ఉన్నారు.

పల్లె ప్రగతి పనులను పరిశీలించిన డీఎల్పీవో

నారాయణఖేడ్, మే 23: నారాయణఖేడ్ డివిజన్ పరిధిలోని పలు గ్రామపంచాయతీలను గురువారం డీఎల్పీవో సంజీవ్‌కుమార్ సందర్శించి పల్లె ప్రగతి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన నారాయణఖేడ్ మండలం పగిడిపల్లి, తుర్కపల్లి, సిర్గాపూర్ మండలం లక్ష్మణ్‌నాయక్‌తండా, సంగం, గైర్హాన్‌తండా పంచాయతీలను సందర్శించి ఆయా గ్రామాల్లో పల్లె ప్రకృతివనాలు, డంపింగ్‌యార్డులు, వైకుంఠధామాలను పరిశీలించి, ఎప్పటికప్పుడు నిర్వహణ చర్యలు చేపట్టాలని, పంచాయతీ కార్యదర్శులకు సూచించారు.